# ఆకారాలు

ఆ కటికచీకట్లో ఊరికి దూరంగా వొంటరిగావున్న ఆ మేడ కేపిటలిస్టు దేశాలమధ్య వున్న రష్యాలా వుంది.

అంతవరకే పోలిక!

మొండిగోడలూ — గజిబిజిగా పెరిగిన వృక్షాలతో ఆవరణ — నరాలు జివ్వుమనేలాగే నిశ్శబ్దం. చీకటిపడితే ఆ ఛాయలకు ఎవ్వరూ పోరు అటువంటి చోట, ఆ సమయంలో ఆకుల గలగల ధ్వని.

ఎండిపోయిన ఆకులు పాదాలకింద నలుగుతున్న — అప్పడాలు విరుగుతున్న ధ్వని.

బేటరీలైట్ వెల్తురు, అలా వొక్క క్షణం నలుదిక్కులా తిరిగింది. వెలిగింది వెలిగినట్లే మూసుకు ది.

మనుష్యుల ఆకారాలు గోడల అంచున కదులుతున్నయ్. అందులో వొక ఆకారం సర్కిల్ది మిగిలినవి పోలీసులవి.

ఆ ఆకారాలు అడుగుల్లో అడుగువేసుకుంటూ గవాక్షాన్ని సమీపించినై. ఇక్కడ గవాక్షం అంటే రెండు అర్థాల్లేక తలుపే గనుక, సర్కిల్ ఆకారం నెమ్మదిగా బహు చాకచక్యంగా తలుపుదగ్గర చెవిపెట్టి వింది, ఏమీ వినపడలేదు. ఈసారి చెవుల్ని కొంచం దూరంగా పెట్టింది. లోపలనుంచి గుసగుసలు వినిపించినై.

పెద్ద ఆకారాన్ని చూచి మిగిలిన చిన్న ఆకారాలు (హోదాలో సుమండీ) చెవులు రిక్కించినయ్. అది చూచి పెద్ద ఆకారం ముక్కుమీద వేలువేసుకొని వారించింది.

ఈసారి చెవుల గొడవ లేకుండానే లోపలనుంచి, అటూ ఇటూ గాబరాగా తిరుగుతున్న పాదాల ధ్వని—చప్పుడు వినిపించింది.

సర్కిల్ ఆకారం ఆపులేక పోయింది 'తలుపు' అని గద్దించింది. వెంటనే ఆకారాలన్నీ రిక్కించటం మానేసి "తలుపు" అని గద్దించినయ్.

తలుపు నెమ్మదిగా తెరుచుకుంటూ వుంది లోపలి వెల్తురు తలుపు సందుల్లోంచి ప్రసరించి ఈఆకారాలను మానవుల్నిగా మార్చింది "రెడీ" అన్నాడు సర్కిల్.

తెరుచుకునే తలుపు మూసుకుపోయింది. అంతా వొక్కసారి కట్ట కట్టుకొని తలుపుమీద పడ్డారు. అవి బార్లగా విడిపోయినయ్. పోలీసులంతా గజిబిజిగా గది ప్రవేశించారు.

ఆహా! అయ్యో!

ఒకమూల వార్తాపత్రికలు కట్టలూ— ఒకమూల పుస్తకాల దొంతర్లూ— వొకపక్క చీట్లపేక ముక్కలూ— ఒకపక్క సిగిరెట్ పీకెలూ-ఇవీ ఆగది రూపరేఖావిలాసాలు.

సర్కిల్ లోపల గదిలోకి వెళ్ళే ద్వారం మూసివుండటం చూశాడు. తలుపుతీసిన కుర్రవాణ్ని చూచి, "పాతాళహోమం?" అన్నాడు.

"కాదు పిశాచనృత్యం" అని జవాబు.

పోలీసులు హఠాత్తుగా తలుపు తెరచి పిస్తోళ్ళు చేతుల్లో పట్టుకొని-అంతకు ముందు కాళ్ళతో పట్టుకున్నారని కాదు— రెండోగది మధ్యకు దూకారు. గిర్రున మడం మీద తిరిగారు.

"హాన్డ్స్ అప్" అని గర్జించాడు సర్కిల్.

అదొక గది అని రాశాను. అంతకంటే మరోమాట దొరకక రాశాను. కాని అది గదే! మధ్య ఒకబల్ల రుంది.దానిమీద వెలుగుతూ వెలగని దీపం. దాని ప్రక్కనగ్లోబ్. ఒకమూల కుర్రవాడు కూచున్నాడు

అతడు మాత్రం పోలీసుల ప్రవేశానికి ముందునుంచీ చేతులు పైకెత్తుకునే కూర్చున్నాడు. మరోమూల మరో కుర్రవాడు. అతని చేతులు మాత్రం దించుకునే వున్నయ్. దించుకునేవున్న చేతుల్తో కంగారుగా చేతిలోని వస్తువు కాగితం కిందకు తోశాడు.

పోలీసులు కాలాంతకులు. అనుమానించితే పేగులెక్క పెడతారు ప్రస్తుతం ఆ కుర్రవాని చేతినరాల్లెక్క పెట్టారు. "హాన్డ్సప్" అనిఅరిచాడు సర్కిల్. ఆ కుర్రవాడుకూడా కిక్కురు మనకుండా చేతులు పైకెత్తాడు. నోట్లో సిగిరెట్ పీకమాత్రం అలాగే వుంది. దమ్ములాగుతూనే వున్నాడు. పొగ వదుల్తూనే వున్నాడు. "ఆ కాగితం కింద ఏం పెట్టావ్?" అడిగాడు సర్కిల్.

కుర్రవాడు పొగతో జవాబు చెప్పాడు. "చేతులు పెట్టికాల్చుకున్నా" మరో దమ్ములాగి "చేతులు దింపనివ్వండి తీసి చూపిస్తాను" అన్నాడు.

ఒక పోలీసుసర్కిల్ చెవిలో భయంవూదాడు. ముందుకు అడుగు వేసిన సర్కిల్ ఆగిపోయి, పోలీసులను ఆజ్ఞాపించాడు—"ఆ కాగిత కింద ఏమిటో చూడండి."

వాళ్ళిద్దరుపోయారు-పాపం! వాళ్ళవీ ప్రాణాలే! వాళ్ళవీ పోలీసు హృదయాలేగదా! కాని అందులో వొకడికి ప్రాణంకంటే పొట్టతీపు. వాడు వొణుకుతూ వీలయినంత దూరంగావుండి, కాగితం కొన పట్టుకొని పైకెత్తాడు.

"అమ్మో!" అని కేకవేసి కళ్ళు మూసుకుని చతికల బడ్డాడు-కూర్చున్నవాణ్ని కుక్కకూడా కరవదు. ఇక బాంబెందుకు పేలుతుంది?

సర్కిల్ కాగితంకిందవున్న పొట్లం చూచి గజగజ లాడాడు. సూటిగా గుండెమీదే పేలిందనుకున్నాడు.

తీరా అందరూ కళ్ళు పెట్టుకుని చూచేటప్పటికి అది పంచదార బిళ్ళల పొట్లాం అయింది.

సర్కిల్‌కి కోపం వచ్చింది. "ఈ ఇల్లంతా సోదా చెయ్యాలి" అన్నాడు.

"సోదాచేస్తే మీ కవమానం. చెయ్యకపోతే మా కవమానం. అలాగే చెయ్యాలి" అన్నాడు మొదట్నుంచీ చేతులు పైకెత్తుకున్న కుర్రవాడు.

సర్కిల్ వెంటనే ఆజ్ఞాపించాడు. ఒక పోలీసు కుర్రవాళ్ళని సోదా చేశాడు–ఒకరి జేబులో వార్తాపత్రికల కటింగులు దొరికాయి. ఒకరి జేబులో నిప్పుల పుల్లలూ చిల్టా దొరికాయి. మరొకరి జేబులో థర్మామీటర్ దొరికింది.

ఈలోగా సర్కిల్ ఊరుకుంటాడా? గదంతా వెతికి అలమర తెరిచాడు. అందులో మూలగా కనబడీ కనబడకుండా, ఒకసీసా వుంది. దాన్నిండా ఏదో ద్రావకం.

"ఇదేమిటి!" సర్కిల్ జబర్దస్తీగా కుర్రవాళ్ళని అడిగాడు. సిగరెట్ తాగే కుర్రవాడు చెప్పాడు–"సీసా"

"లోపలి?"

"ద్రావకం"

"ఏం ద్రావకం?" మీదకు మీదకువెల్తూ, రౌద్రంగా అడిగాడు! కుర్రవాళ్ళు [illegible] వొకరిమొహాలు వొకరు చూచుకున్నారు–"చెప్పండి" గద్దించాడు సర్కిల్.

తలుపుతీసిన కుర్రవాడు చెప్పాడు. "మాకేం తెలుస్తుంది! మేమేం డాక్టర్లమా!"

"అదే తెలుస్తుంది. ఇప్పుడు తెలియదు. రేపు తెలుస్తుంది. ఖబడ్దార్...." అన్నాడు గడ్డంపోలీసు.

సర్కిలు సీసాను గుడ్డకు చుట్టి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో పోలీసులు రెండు ఎర్ర అట్టల పుస్తకాలు పట్టుకొచ్చారు. అవన్నీ

తీసుకొని కోరచూపులు చూస్తూ పోలీసులు నిష్క్రమించారు. ఈ మానవులు మళ్ళీ గదిలోనుంచి బయటకు అడుగుపెట్టగానే ఆకారాలుగా తయారయ్యారు.

కుర్రవాళ్ళంతా విరగబడి నవ్వుతున్నారు. చేతులు పైకెత్తుకొని కూర్చున్న కుర్రవాడు (ఇప్పుడు దించేశాడు) తలుపుతీసిన కుర్రవాణ్ణి చూచి, "మళ్ళీ దబ్బొచ్చేదాకా నీకు కాడ్లివర్ ఆయిల్‌లేదు" అన్నాడు.

"మళ్ళీ డబ్బొచ్చేదాకా నాకు గుండెజబ్బూ వుండదు...." అన్నాడు ఆ కుర్రవాడు.

నవ్వుకున్నారు.

వెంటనే గ్లోబ్ చుట్టూ మూగారు. వెంటనే బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయి తర్కనలో పడ్డారు—రష్యా—మధ్యధరా సముద్రం—ఇటలీ—జర్మనీ—యూరప్‌లో సెకండ్ ఫ్రంట్ ఇండియా ప్రజాయుద్ధం.